అమ్మా, నాన్నా మాట్లాడుకోవటం ఎనిమిదేళ్ల కీర్తి విన్నది. తమ్ముడు రమేశ్‌కి బాగా జబ్బు చేసింది.

"నాల్గేళ్లకే నా కొడుక్కి నూరేళ్లు నిండుతున్నాయా? బ్రతికే మార్గమే లేదా?" అని తల్లి జానకి ఏడుస్తోంది.

"ఏం చేయను? వాడి మందులకి నా దగ్గర డబ్బు లేదు. వాణ్నిక అద్భుతం ఒక్కటే రక్షించాలి!" అన్నాడు తండ్రి శ్రీరాం నిస్పృహగా.

# అద్భుతం ఖరీదు ఎంత?

తన పుస్తకాల గూడు దగ్గరకి పరిగెత్తింది కీర్తి. తండ్రి అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బులు దాచుకున్న మట్టి కుండ హుండీని బయటకు తీసింది. అటూ యిటూ వూపితే, హుండీ గలగల లాడింది. దొడ్లోకి వెళ్లి నెమ్మదిగా దాన్ని పగలగొట్టింది. చిందర వందరగా పడిన చిల్లర డబ్బులన్నీ పోగేసి, తన చేతి గుడ్డలో మూట కట్టింది. దొడ్డి వైపు నుంచే బజారు వైపు పరిగెత్తింది.

మందుల షాపువాడు ఏదో టెలిఫోన్‌లో పిచ్చాపాటీ మాట్లాడుతున్నాడు. వచ్చింది పేద పిల్ల—మరేం అర్జెంటు లేదన్నట్టు చూస్తూ తన పనిలో తనున్నాడు.

"అయ్యా! మా తమ్ముడికి ప్రమాదంగా ఉంది. తొందరగా మందివ్వండి" అంది కీర్తి.

షాపువాడు వినిపించుకోలేదు.

"నిజంగా మా తమ్ముడికి చాలా జబ్బుగా ఉందయ్యా! కొంచెం అద్భుతాన్నివ్వండి" అని కీర్తి ప్రాధేయపడింది.

"ఫోన్‌లో మాట్లాడుతూంటే మధ్య నీ గోల యేమిటి?" అని షాపువాడు చిరాకు పడ్డాడు.

అప్పుడే అక్కడికి వచ్చినాయన వాళ్ల మాటలు విన్నాడు. "ఏం కావాలమ్మా?" అని ఆదరంగా అడిగాడు.

"మా తమ్ముడికి చాలా ప్రమాదంగా ఉందిటండీ! ఆపరేషన్ చేయాలిట. నాన్న దగ్గర డబ్బు లేదు. అద్భుతం ఒక్కటే బతికిస్తుందిట! నా దగ్గరున్న డబ్బుతో అద్భుతాన్ని కొందామని..."

ఆ పిల్ల కళ్లల్లోని అమాయకత్వానికి అతని కళ్లు చెమర్చాయి. "నీ దగ్గర ఎంత డబ్బుందమ్మా?" అని ఆమె భుజం మీద బుజ్జగింపుగా చెయ్యి వేశాడు.

చేగుడ్డ ముడివిప్పి అక్కడ బల్ల మీద చిల్లర గుమ్మరించి గబగబా లెక్క పెట్టి "ఏడు రూపాయల డెబ్భయ్యేదు పైసలు" అంది కీర్తి.

"ఓహో! నా దగ్గరో అద్భుతం ఉంది. దాని ఖరీదు సరిగ్గా ఏడు రూపాయలు. నీ తమ్ముడికి సరిపోతుందేమో చూద్దాం! నన్ను మీ యింటికి తీసుకువెళ్లు!" అన్నాడతను—ఆమె డబ్బుల మూటని తన కోటు జేబులో పెట్టుకుంటూ.

కీర్తి ఉత్సాహంగా అతని చేయి పట్టుకుని, దగ్గరలోనే ఉన్న వాళ్లింటికి తీసుకువెళ్లింది. "ఆయన దగ్గర అద్భుతం ఉందిట!" అని తల్లిదండ్రులకి చెప్పింది.

తమ పిల్ల ఏదో చిక్కు తెచ్చి పెట్టిందని కీర్తి మీద చిరాకు పడ్డారు తల్లిదండ్రులు.

వాళ్లని వారిస్తూ, "నిజంగానే నా దగ్గర ఆ అద్భుతం ఉంది. నాతో పాటు హాస్పటలుకి రండి" అన్నాడు అతను.

అతనితో పాటు ఓ పెద్ద హాస్పటల్లో అడుగు పెడుతున్నప్పుడు కాని, ఆయన ప్రఖ్యాత సర్జన్ పరంధామ్ అని వాళ్లకి తెలిసిరాలేదు. వాళ్లు తమ ఆశ్చర్యం నుంచి తేరుకొనేలోగానే, ఆయన రమేశ్‌ని పరీక్షించటం—వెంటనే ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేయటం జరిగిపోయాయి!

ఆపరేషన్ చేసి చిరునవ్వుతో బయటకు వచ్చిన డాక్టర్ పరంధామ్‌తో, "మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను బాబుగారూ!" అన్నాడు శ్రీరాం.

"డాక్టరుగారు అద్భుతం ఇచ్చారుగా! తమ్ముడికి నయమైంది" అంది కీర్తి.

"ఆపరేషన్‌కి ఎంతైందో!" అని తనలో తను గొణుక్కుంది జానకి.

"డాక్టరుగారు నాతో చెప్పారమ్మా! అద్భుతం ఖరీదు ఏడు రూపాయలట! అవును కదా డాక్టరుగారూ?" అంది కీర్తి పరంధామ్ దగ్గరకి వచ్చి.

"అవునమ్మా! మర్చేపోయాను. నా దగ్గర ఇంకా డెబ్భయ్యేదు పైసలు నీవి మిగిలాయి. ఇంద. తీసుకో!" అని ఆ పిల్ల చేతుల్లో పెట్టాడు డాక్టర్ పరంధామ్.

ఆ పిల్ల కళ్లల్లో మెరుస్తున్న అద్భుతమయిన తృప్తిని గుర్తించగలిగిన ఆ డాక్టర్ కళ్లల్లో, ఆనందబాష్పాలు చిప్పిల్లాయి!

**తటవర్తి రామచంద్రరావు**

---

# అదిరేటి డ్రస్సు మేమేస్తే...

**ఏ. రామకృష్ణప్రసాద్**

"మా చీరలు కొనండి! కేజీల కొద్దీ బంగారం గెలుచుకోండి!" టీవీలో భారీగా అడ్వర్టయిజుమెంట్లు వస్తున్నాయి.

"అమ్మా! కేజీ బంగారమంట, చీరలు కొంటావా?" డిగ్రీ చదువుతున్న పుత్రరత్నం రాజేశ్, వాళ్లమ్మని టీజ్ చేశాడు.

"ఆగరా! సీరియల్ మాంచి సస్పెన్స్‌గా ఉన్నప్పుడు 'బ్రేక్' అని ఆపు చేశాడు" అచ్చమాంబ టీవీ నుండి కన్నార్పకుండా విసుక్కుంది.

"ఔరా! ఆడవాళ్లు సహజంగా ఇష్టపడే చీరలను కూడా ఈ అరవ కన్నీటి కుటుంబకథా సీరియళ్లు డామినేట్ చేశాయి కదా!" స్వగతించుకున్నాడు అచ్చమాంబ 'బాపూ భర్త' సుబ్బారావు.

అంతలో కరెంటు పోయింది.

"హమ్మ!" వాళ్ల అమ్మ పెట్టిన సీరియల్‌ని చూడలేక అవస్థ పడుతున్న రాజేశ్ గారిగా ఊపిరి పీల్చాడు.

సుబ్బారావు కంత ధైర్యం లేక పుస్తకంలో తలకాయ దూర్చి ముసి ముసి నవ్వులు నవ్వుతున్నాడు.

"అబ్బ! మాంచి రసపట్టులో తీసి చచ్చాడు" సుబ్బారావు వాళ్ల అమ్మగారు విసుక్కున్నారు.

అచ్చమాంబ వంటింట్లో మాగుతున్న కూరను కలపడానికి వెళ్లింది.

సడెన్‌గా రాజేశ్ "వావ్!" అని ఇంగ్లీషులో ఆశ్చర్యపోయాడు.

"ఏమిట్రా! ఆ గావుకేకలేంటి?" వాళ్ల అమ్మ విసుక్కుంది.

"హైదరాబాద్‌లో ఫ్యాషన్ షో. కత్రినాకైఫ్ వస్తుందట" కత్రినా కైఫ్ అంటేనే రాజేశ్‌కు కైపెక్కుతుంది.

"ఐతే ఏంట్రా! రోజూ మేమందరం పడుకున్న తరువాత ఎఫ్ టీవీ చూస్తూనే ఉంటావుగా! నీకు కొత్తేంటి?" ఎవరికీ వినపడకుండా సుబ్బారావు గొణుక్కున్నాడు.

"నాన్నా! నాన్నా! ఆ ఫ్యాషన్ షోలో ఉండే డ్రెస్ ఒకటి కొను